సాక్షి అనంతపురం

శనివారం, 9, మార్చి, 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

మద్దతు ధరతో రబీ ఉత్పత్తుల కొనుగోలు



పప్పుశనగ



వేరుశనగ

అనంతపురం అగ్రికల్చర్: రబీలో రైతులు పండించిన పప్పుశనగ, వేరుశనగను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో కొనుగోళ్లకు చర్యలు చేపట్టినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటా పప్పుశనగ రూ.5,440, క్వింటా వేరుశనగ రూ.6,377 ప్రకారం నాఫెడ్ ద్వారా కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు చేస్తామని పేర్కొన్నారు. రబీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12,453 మెట్రిక్ టన్నుల పప్పుశనగ, 16,179 మెట్రిక్ టన్నుల వేరుశనగ కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు వెల్లడించారు. ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ–క్రాప్ ఆధారంగా రైతులు తమ వివరాలు నమోదు చేసుకుంటే త్వరలోనే కొనుగోళ్లు మొదలవుతాయన్నారు. కనీస మద్దతు ధర కన్నా బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉంటే అమ్ముకోవచ్చన్నారు. అంతకన్నా తక్కువగా ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రకటించకముందే ఓవరాక్షన్ ఎందుకు?

- గుమ్మనూరు నారాయణకు టీడీపీ నేత పవన్ గౌడ్ హితవు



మాట్లాడుతున్న పవన్ గౌడ్

గుంతకల్లు: తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుంతకల్లు ఎమ్మెల్యే టికెట్ ఎవరికీ ప్రకటించక ముందే ఓవరాక్షన్ ఎందుకు చేస్తున్నారని గుమ్మనూరు నారాయణకు ఆ పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఆర్.పవన్‌కుమార్ గౌడ్ హితవు చెప్పారు. ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణ శుక్రవారం సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం గుంతకల్లులో టీడీపీ కార్యాలయం ప్రారంభిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని అందులో విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన పవన్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి కొన్ని పద్ధతులు ఉన్నాయని, పరిధి దాటి ప్రవర్తించడం మంచిది కాదని హెచ్చరించారు. పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ ఎవరికని ప్రకటించకముందే సొంత నిర్ణయాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. మీకు అంత ఉత్సాహంగా ఉంటే ఆలూరులో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరూపాక్షి సవాల్ విసిరారు కదా.. అక్కడ పోటీ చేయాలని హితవు పలికారు. లేదా గుంతకల్లు అభ్యర్థిగా మీ అన్న గుమ్మనూరు జయరాం పేరును ప్రకటించినప్పుడు మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి.. అంతేకానీ సొంత నిర్ణయాలు తీసుకుంటే గుంతకల్లులో నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. పార్టీ పెద్దలు కూడా ఇలాంటి చర్యలకు ఫుల్‌స్టాప్ పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ హనుమంతు, నాయకులు కేశవ తదితరులు పాల్గొన్నారు.

‘ఓటరు’ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ఓటరు నమోదు, ఓటు తొలగింపు, వివరాల మార్పు, చేర్పునకు సంబంధించి దరఖాస్తుల పరిష్కారాన్ని జిల్లా ఎన్నికల యంత్రాంగం వేగవంతం చేసింది. గత ఏడాది డిసెంబరు 10 నుంచి ఈ నెల 6 వరకు ఓటు నమోదు (ఫారం–6), ఓటు తొలగింపు (ఫారం–7), వివరాలు మార్పునకు (ఫారం–8) సంబంధించిన దరఖాస్తులు మొత్తం 1,17,808 వచ్చాయి. వీటిలో 18,068 దరఖాస్తులను తిరస్కరించారు. 81,303 పరిష్కరించారు. 10,901 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. 7,676 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.

దరఖాస్తుల పరిష్కారం ఇలా..

- ఓటరుగా నమోదు (ఫారం–6)కు 40,142 దరఖాస్తులు రాగా అందులో 9,890 తిరస్కరించారు. 27,183 పరిష్కరించారు. 3,026 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. 40 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.
- ఓటు తొలగింపు(ఫారం–7)నకు 42,734 దరఖాస్తులు రాగా.. అందులో 5,815 దరఖాస్తులు తిరస్కరించారు. 29,154 దరఖాస్తులు పరిష్కరించారు. 4,899 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. 1,093 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.
- ఓటరు జాబితాలో ఓటరు వివరాల మార్పులు, చేర్పు (ఫారం–8)నకు 34,932 దరఖాస్తులు రాగా.. అందులో 2,360 దరఖాస్తులు తిరస్కరించారు. 24,966 దరఖాస్తులు పరిష్కరించారు. 2,976 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. 4,630 దరఖాస్తులు విచారణ దశలో ఉన్నాయి.

బాబు నిర్వాకం.. జేసీ అరాచకం

- గ్రానైట్ పరిశ్రమలపై టీడీపీ హయాంలో గొడ్డలిపెట్టు
- అనాలోచిత నిర్ణయంతో తొక్కేసిన చంద్రబాబు
- పరిశ్రమల యజమానులను వెంటాడి వేధించిన జేసీ ప్రభాకర్ రెడ్డి
- బాధ భరించలేక యంత్రాలను తెగనమ్ముకున్న నిర్వాహకులు



చంద్రబాబు చర్యలతో తాడిపత్రి సమీపంలో మూత పడిన పరిశ్రమ (ఫైల్)

తాడిపత్రి రూరల్: గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు తీసుకున్న ఒక్క అనాలోచిత నిర్ణయం గ్రానైట్ పరిశ్రమను కోలుకోలేకుండా చేసింది. పరిశ్రమలు దివాళా తీసేందుకు కారణమైంది. వేలాది మంది వలస కూలీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించిన పరిశ్రమల నిర్వాహకులు చంద్రబాబు దెబ్బతో కోలుకోలేకపోయారు. రూ. కోట్లు పెట్టుబడి పెట్టి కొనుగోలు చేసిన యంత్రాలను రూ. లక్షలకే తెగనమ్ముకున్నారు. చాలామంది అప్పుల్లో కూరుకుపోయారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో గ్రానైట్ పరిశ్రమ ఒక వెలుగు వెలిగింది. ఆయన తీసుకున్న నిర్ణయాలు నిర్వాహకులకు ఊపిరినిచ్చాయి. తదనంతరం వచ్చిన పాలకుల చిన్నచూపుతో ఈ పరిశ్రమ ప్రభ తగ్గుతూ వచ్చింది.

స్లాబ్ సిస్టం ఎత్తేసి.. ఉసురు తీసి

2014లో అధికారంలోకి రాగానే నారా చంద్రబాబు గ్రానైట్ పరిశ్రమపై కన్నెర్ర చేశారు. అప్పటి వరకూ అమలులో ఉన్న స్లాబ్ సిస్టం ఎత్తి వేశారు. దీంతో నష్టాలు వస్తాయని, దివాళా తీస్తామని నిర్వాహకులు మొత్తుకున్నా లెక్క చేయలేదు. గ్రానైట్ పరిశ్రమ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినా పట్టించుకోలేదు. 2019లో ఎన్నికలు దగ్గర పడడంతో మొదటికే మోసం వస్తుందని భావించి కంటి తుడుపు చర్యగా గ్రానైట్ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయడానికంటూ కమిటీ ఏర్పాటు చేశారు. కొన్నాళ్లకు కమిటీ నివేదిక ఇచ్చినా దాన్ని బుట్టదాఖలు చేశారు.

చెక్‌పోస్టులతో కొంపముంచిన జేసీ..

గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకులను గట్టెక్కించాల్సిన అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి వారిపై మరింత కత్తిగట్టారు. పరిశ్రమల యజమానులను దొంగలుగా చిత్రీకరించారు. బిల్లులు లేకుండా ముడి సరుకు వస్తోందంటూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయించారు. సరుకును తరలిస్తున్న లారీల యజమానులను మామూళ్ల కోసం అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. మరో వైపు జేసీ అనుచరులు మాత్రం యథేచ్ఛగా నాసిరకం ముడి సరుకును ఎలాంటి బిల్లులు లేకుండా రవాణా చేసేవారు. జేసీ పెత్తనం వల్ల పనికి రాని సరుకును కూడా కొనుగోలు చేస్తూ యజమానులు మరింత నష్టపోయారు. ఈ దురాగతాలపై ఫిర్యాదు రావడంతో చర్యలకు దిగిన అప్పటి మైన్స్ అండ్ జియాలజీ అధికారిపైనా జేసీ అనుచరులు దాడికి యత్నించారు. తమ జోలికి వస్తే తల నరికి లారీకి కడతామంటూ వారు బెదిరించడం అప్పట్లో సంచలనం రేపింది.

యంత్రాలను నష్టాలకు అమ్ముకుని..

వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో తాడిపత్రి పరిసరాల్లో 250 వరకూ గ్రానైట్ పరిశ్రమలు ఉండేవి. చంద్రబాబు, జేసీ ప్రభాకర్ రెడ్డి నిర్వాకాలతో టీడీపీ ప్రభుత్వ హయాంలో వందకు తగ్గిపోయాయి. పరిశ్రమలు మూతపడటంతో వేలాది మంది ఉపాధి కోల్పోయారు. బిహార్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల కార్మికులకు వేలకు వేలు అడ్వాన్స్‌లు ఇచ్చి తీసుకొచ్చిన యజమానులు.. కార్మికులు అర్ధంతరంగా వెళ్లడంతో ఆ నష్టాన్ని కూడా మౌనంగా భరించారు. ట్రాలీ, కట్టర్లు, పాలిష్ తదితర మిషన్లను గుజిరీ కింద తెగనమ్ముకున్నారు. చంద్రబాబు మిగిల్చిన పీడ కలను నేటికీ మర్చిపోలేకున్నామని వారు ఆవేదనగా చెబుతున్నారు.





చంద్రబాబు, జేసీ నిర్వాకంతో ప్రభ కోల్పోయిన గ్రానైట్ పరిశ్రమ, వృథాగా మారిన సామగ్రి

మిషన్లను గుజిరీకి వేశా

ఎన్నో ఆశలతో రూ.కోటి పెట్టుబడి పెట్టి గ్రానైట్ పరిశ్రమను నెలకొల్పా. టీడీపీ హయాంలో తీసుకున్న నిర్ణయాలు శరాఘాతంగా మారాయి. దీంతో నష్టాలు తప్పలేదు. పరిశ్రమలోని మిషన్లు, ఇతర సామగ్రిని గుజిరికి వేశా. రూ. 10 లక్షలే అన్నా ఎక్కడ తుప్పు పడతాయన్న భయంతో ఆ రేటుకే అమ్మేశా. ఇప్పటికీ ఆ బాధ నుంచి కోలుకోలేకపోతున్నా.

– రామ్మోహన్, తాడిపత్రివాసి

జగన్‌ను ఢీకొనే దమ్ములేకనే బీజేపీ పంచన

- బాబుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శంకరనారాయణ, విశ్వేశ్వరరెడ్డి ధ్వజం




మాట్లాడుతున్న శంకరనారాయణ, చిత్రంలో విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: జనం బలం కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నికల్లో ఢీకొనే దమ్ము లేకనే టీడీపీ అధినేత చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ ద్వారా బీజేపీ పంచన చేరి పొత్తులు కోసం పాకులాడుతున్నాడని వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త శంకరనారాయణ, ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం వారు కూడేరు మండలం పి.నారాయణపురంలో మీడియాతో మాట్లాడారు. తన పాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించడంతో చంద్రబాబును ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ‘సిద్ధం’ సభలకు జనాలు హోరెత్తడం, తన సభలకు జనాలు రాకపోవడంతో చంద్రబాబు సహనం కోల్పోయి విమర్శలు చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు దమ్ముంటే పొత్తులు లేకుండా సొంతంగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. ప్రజా మద్దతు సంపూర్ణంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గాలికి టీడీపీ–జనసేనల సైకిల్– గ్లాస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. టీడీపీ నేతలు చెప్పే మాయమాటలు విని ప్రజలెవ్వరూ మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, అగ్రి అడ్వయిజరీ బోర్డు మండల చైర్‌పర్సన్ నిర్మలమ్మ, సర్పంచులు హనుమంత రెడ్డి, రంగారెడ్డి, ఓబుళమ్మ పాల్గొన్నారు.

‘వైకుంఠం’కు చుక్కలు

- అనమ్మతులు తానా.. అధిష్టానం తందానా
- సీటుపై హామీ లేక ప్రభాకర్ చౌదరిలో అసహనం
- జనసేనకు సీటు ఇస్తున్నట్టు టీడీపీలో ప్రచారం
- సీటు ఇవ్వకపోతే రాజకీయ సన్యాసమే అంటున్న అనుచరవర్గం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత వైకుంఠం ప్రభాకర్‌చౌదరికి పార్టీ అధిష్టానం చుక్కలు చూపిస్తోంది. 2014లో టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచిన ఆయన 2019లో ఘోరంగా ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీచేయాలని తీవ్రంగా యత్నిస్తున్న చౌదరికి పార్టీ అధినేత చంద్రబాబు నుంచి స్పష్టమైన హామీ రాలేదు. టీడీపీ – జనసేన పొత్తులో భాగంగా ఈ సీటు జనసేనకు ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రభాకర్ చౌదరికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇన్నేళ్లుగా పార్టీకి కష్టపడిన తనకు ఈ దుస్థితి ఏమిటని కార్యకర్తల దగ్గర వాపోయినట్టు తెలుస్తోంది. ఇప్పుడు గనుక టికెట్ ఇవ్వకపోతే ప్రభాకర్ చౌదరి రాజకీయాలకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని అనుచరులు వాపోతున్నారు.

పరిగణనలోకి కూడా తీసుకోలేదు

గత రెండు మాసాలుగా టికెట్ కోసం యత్నిస్తున్న ప్రభాకర్ చౌదరికి ఏ దశలోనూ హామీ లభించలేదు. పైగా ఈయన్ను పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు కూడా లేవు. అర్బన్ నియోజకవర్గంలో పాతిక వేలకు పైగా బలిజ సామాజిక వర్గం ఓట్లు ఉన్నట్టు అంచనా. దీంతో జనసేనకు ఇస్తే బావుంటుందనేది చంద్రబాబు ఆలోచన. 2019 నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో టీడీపీ కోసం కృషి చేస్తే ఉన్నట్టుండి జనసేనకు టికెట్ ఇస్తే తన పరిస్థితి ఏమిటని చౌదరి ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు గనుక టికెట్ తెచ్చుకోలేకపోతే రాజకీయ సన్యాసం తప్పదేమోనన్న భయం ఆయన్ను వెంటాడుతోందని తెలుస్తోంది.

తేల్చుకునేందుకు విజయవాడకెళ్లిన చౌదరి

వాడుకుని వదిలేయడమంటే చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అనేది అందరికీ తెలిసిందే. ఈ కోవలోనే బీకే పార్థసారథి, జితేందర్‌గౌడ్ లాంటి వాళ్లందరూ బలయ్యారు. తాజాగా ప్రభాకర్ చౌదరి వంతు వచ్చినట్లు తెలుస్తోంది. ఓ వైపు సొంత పార్టీలోనే ప్రభాకర్ చౌదరిని వ్యతిరేకించే వాళ్లు తానా అంటుంటే.. వీరికి వంతపాడుతూ అధిష్టానం తందానా అంటోంది. జేసీ దివాకర్‌రెడ్డి అనుచరులు ప్రభాకర్ చౌదరిపై ఏదో ఒక రకంగా రోజూ వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఒకవైపు దీన్ని ఎదుర్కోలేక తంటాలు పడుతుంటే మరోవైపు అధిష్టానం నుంచి ఎలాంటి హామీ లేదు. ఇప్పుడాయన పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టీడీపీ కేడర్ పరిస్థితి గందరగోళంగా ఉంది. పొత్తులో ఏ పార్టీకి సీటిస్తారో, ఎవరు అభ్యర్థో అర్థం కాక సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అధిష్టానంతో తాడో పేడో తేల్చుకునేందుకు ప్రభాకర్ చౌదరి విజయవాడకు బయలుదేరినట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు.

హరహర మహాదేవ శంభోశంకర

మహాశివరాత్రి పండుగను శుక్రవారం జిల్లా అంతటా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రసిద్ధ శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. పలువురు ఉపవాసాలు ఉండి రాత్రంగా భక్తిశ్రద్ధలతో జాగారం చేశారు. హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామ స్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. పలు చోట్ల పరమశివుని రథోత్సవాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయాల్లో మహాశివరాత్రి పండుగ గురించి పండితులు వివరించారు.



వజ్రకరూరులో ఓంకారేశ్వరుడిగా భోగేశ్వరుడు



అనంతపురం: మొదటిరోడ్డు శివాలయంలో నంది వాహనంపై ఊరేగుతున్న ఆదిదంపతులు

మరిన్ని శివరాత్రి ఫొటోలు 8లో

ఉద్యోగులు, ఉపాధ్యాయుల శ్రేయస్సే లక్ష్యం

- విద్యావ్యవస్థలో సమున్నత మార్పులు
- విద్యారంగానికి రూ.71 వేల కోట్ల ఖర్చు
- ఐదేళ్లలో ఆరు లక్షలకు పైగా ఉద్యోగాలు
- మహిళా పక్షపాతి సీఎం జగన్
- చైల్డ్ కేర్ లీవులు 180 రోజులకు పెంపు
- ఏపీ టీచర్స్ జేఏసీ విద్యా సదస్సు.. మహిళా దినోత్సవ సభలో వక్తలు





విద్యా సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, చిత్రంలో ఎంవీ రామచంద్రారెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కాకర్ల వెంకట్రామిరెడ్డి, బోయ శాంతమ్మ తదితరులు, హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

పుట్టపర్తి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయి ఆరామంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో విద్యా సదస్సు, మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రా రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. కల్పలతా రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతానికి పైగా ప్రాధాన్యత దక్కుతోందన్నారు. పార్లమెంట్‌లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం లభిస్తే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడ మహిళలకు అంతకుముందే మంచి అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్ కేర్ లీవ్‌లను 60 రోజుల నుంచి 180 రోజులకు పెంచారన్నారు. వాటిని పిల్లల వయసు 18 ఏళ్లలోపు వాడుకోవాలన్న నిబంధనను తొలగించేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చారన్నారు. ప్రతి మహిళా దినోత్సవానికి మహిళా ఉద్యోగులకు ఓ వరం ప్రకటించారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సీఎం కట్టుబడి ఉన్నారని పునరుద్ఘాటించారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు తప్పక పరిష్కరిస్తారన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. విద్య కోసం ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు చేయని విధంగా ఏపీలో రూ.71 వేల కోట్లు ఖర్చు చేయడం అభినందనీయమన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. రాజకీయ లబ్ధి ఆలోచించకుండా, ఓటర్లు కాకపోయినా విద్యార్థుల భవిష్యత్తు కోసం సీఎం జగన్ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమన్నారు.

కరోనా సమయంలోనూ అండగా ఉన్నారు

కరోనా విపత్కర సమయంలోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అండగా సీఎం జగన్ నిలిచారని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి కొనియాడారు. రెవెన్యూ లేక రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్న సమయంలోనూ ఉద్యోగులకు జీతాలు చెల్లించారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి రెండున్నర లక్షల ఉద్యోగాలు కల్పించారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారని, గత డీఎస్సీలకు సంబంధించి 6,800 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆరున్నర లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు సంపూర్ణంగా పరిష్కరించేందుకు రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి అడ్డుపడిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే 27 శాతం ఐఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వందలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాన్సర్ బాధిత బాలుడిని ఆదుకున్న ప్రభుత్వం


సీఎంఆర్ఎఫ్ కాపీని బాలుడి తండ్రికి అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు టౌన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ బాలుడిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందజేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. వివరాలు... పాత గుంతకల్లు ప్రాంతానికి చెందిన స్వర్ణకార కార్మికుడు భీమలింగాచారి కుమారుడు విశ్వాంత్ ఆచారి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి... ఆ బాలుడి పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందేలా చొరవ తీసుకున్నారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ వెంటనే సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.12 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను శుక్రవారం తన నివాసంలో బాధిత బాలుడి తండ్రికి ఎమ్మెల్యే వైవీఆర్ అందజేశారు. ఈ ఉత్తర్వుల కాపీని హైదరాబాద్‌లోని అమెరికన్ ఆస్పత్రిలో అందజేసి ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సంపత్ ఆచారి, దర్గానాయుడు పాల్గొన్నారు.

హాస్యకథల రచయిత్రి జయలక్ష్మీరాజ్ మృతి



అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ హాస్యకథా రచయిత్రి అక్కిరాజు జయలక్ష్మీరాజ్ (74) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి కన్నుమూశారు. డోన్‌కు చెందిన ఆమెకు అనంతపురానికి చెందిన శ్రీరామరాజ్‌తో వివాహమైంది. ముగ్గురు కొడుకులు ఉన్నారు. కుటుంబసభ్యులతో కలసి అనంతపురంలోని స్థిరపడిన ఆమె జిల్లా సాహిత్యంలో తొలితరం రచయిత్రిగా ఖ్యాతిగాంచారు. ఆమె రచనల్లో కొన్ని సినిమాలుగా కూడా వచ్చాయి. పొగబండి నేస్తం కథాసంపుటిని చదివిన ప్రఖ్యాత కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి తన సొంత డబ్బుతో అచ్చు వేయించడమే కాక అవార్డునూ అందజేశారు. ఇటీవలే ఏపీ తెలుగు భాషా సంఘం ద్వారా తెలుగు భాషా సేవా పురస్కారమందుకున్నారు. ఆమె అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుమారుడు అక్కిరాజు సుధాకరరాజు తెలిపారు. కాగా, జయలక్ష్మీరాజ్ మృతిపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, పండిట్ రియాజుద్దీన్, ఏలూరు యంగన్న, ఆచార్య దేవకి, డాక్టర్ అనంత మాలతి సంతాపం తెలిపారు.

శివోహం..

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- శైవక్షేత్రాల్లో విశేష అభిషేకాలు


సమస్త లోకాన్ని తనలో నిలుపుకుని తానే లోకమైన విశ్వనాథుడు... ప్రతి ఇంటా కొలువుదీరాడు. ఆదిదేవుడైన పరమశివుడు మానవ జీవనతాత్వికతకు అతి సన్నిహితంగా ఉంటూ సుఖదుఃఖాలు అనే ద్వంద్వాలన్నింటినీ ఏకం చేసే అద్వైతమూర్తిగా గోచరించాడు. శివ అనే రెండక్షరాలు పరబ్రహ్మ స్వరూపం. 'శి' అంటే పాపనాశనం. 'వ' అంటే ముక్తిప్రదానం అని వేదాలు చెబుతున్నాయి. ఈ రెండు అక్షరాలు ఒక్కసారి జపిస్తే సమస్త పాపాలు నశించి ముక్తికి మార్గం ఏర్పడుతుందని అంటారు. 'నామస్మరణాత్ అన్యోపాయం నహి పశ్యామో భవతరణే' అన్నారు ఎందరో గురువులు. అదే శివనామస్మరణమై శుక్రవారం జిల్లా అంతటా మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గ్రామగ్రామాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు ఉపవాస దీక్ష బూని ప్రత్యేక పూజలు, అర్చనలు, జాగరణ చేశారు. రుద్రాభిషేకాలు, శివ కల్యాణాలు, జపాలు, స్తోత్రాలు, కీర్తనలు అఖండ దీపారాధనలు, బిల్వ దళార్చనలు పెద్ద ఎత్తున సాగాయి.

– సాక్షి నెట్‌వర్క్


కూడేరు: జోడులింగాల సంగమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ


పామిడి: పురాతన భోగేశ్వరాలయంలో విశేష అలంకరణ


బీకేఎస్: ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కాశీవిశ్వేశ్వరుడు


తాడిపత్రి అర్బన్: పుష్పాలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు


అనంతపురం: శివకోటి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు


అనంతపురం: గీతా మందిరంలో దైవ దర్శనానికి వేచి ఉన్న భక్తులు


అనంతపురం: గీతామందిరంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న యువతి


అనంతపురం: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల రద్దీ


అనంతపురం: మొదటిరోడ్డు శివాలయం వద్ద కోలాటం ఆడుతున్న మహిళలు


అనంతపురం: కాశీవిశ్వేశ్వర కోదండ రామాయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

వైఎస్సార్‌సీపీకి విధేయులం

కళ్యాణదుర్గం: 'మేము... మా కుటుంబం, నా అనుయాయులంతా వైఎస్సార్‌సీపీకి విధేయులమని' డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు స్పష్టంచేశారు. కళ్యాణదుర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి, గుంతకల్లు నియోజకవర్గ పరిశీలకుడు వై.భీమిరెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న పామిడిలో జరిగిన వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డితో తాను వాగ్వాదం చేసినట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియా అవాస్తవాలను ప్రచారం చేశాయని మండిపడ్డారు. నిజానికి తాను ఎలాంటి వాగ్వాదం చేయాలేదన్నారు. మహిళలకు మాట్లాడే అవకాశం కల్పిస్తే బాగుంటుందని సూచించినట్లు తెలిపారు. అయితే మరో గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవం ఉండడంతో సమయాభావం వల్ల మహిళలకు మాట్లాడే అవకాశం కల్పించలేకపోయినట్లు వివరించారు. అయితే దీనిని రాద్ధాంతం చేస్తూ టీడీపీ అసత్య ఆరోపణలతో చంకలు గుద్దుకుంటోందన్నారు. బీసీలకు అన్ని రంగాల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. గుంతకల్లులో టికెట్ ఎవరికిచ్చినా తాము సహకరిస్తామని, వై.వెంకట్రామిరెడ్డికి టికెట్ కేటాయించినా కష్టపడి గెలిపించుకుంటామని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న పామిడి వీరా (చిత్రంలో) వై.భీమిరెడ్డి

పండుగ పూట విషాదం


మహేష్ (ఫైల్), సాంబమూర్తి (ఫైల్)

తాడిమర్రి: మహాశివరాత్రి సందర్భంగా జాతరకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం అంతరగంగ కు చెందిన బుట్టా మహేష్ (32) సెంట్రింగ్ పనులు, అనంతపురానికి చెందిన సాంబమూర్తి (61) టైలరింగ్ చేస్తూ కుటుంబాలను పోషించు కుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఇరువురూ ద్విచక్ర వాహనంపై వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం బలపనూరు సమీపంలోని గొజ్జేపల్లిలో జరిగే దత్తాత్రేయ జాతరకు బయలుదేరారు. తాడిమర్రి మండలం దాడితోట సమీపంలోకి చేరుకోగానే పార్నపల్లికి వెళ్లే మార్గాన్ని ఓ రైతు ద్వారా తెలుసుకుని వెనక్కు తిరిగి బైపాస్ రోడ్డుకు చేరుకుంటుండగా పులివెందులకు వెళ్తున్న ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఘటనలో బుట్టా మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాంబమూర్తిని తన జీపులోనే ఎస్‌ఐ నాగస్వామి ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యంలో 108 వాహనం రాగానే క్షతగాత్రున్ని అందులోకి మార్చి అనంతపురానికి తరలించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాంబమూర్తి చనిపోయాడు. మృతుడు మహేష్ భార్య, వలంటీర్‌గా పనిచేస్తున్న తేజశ్విని ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. వీరికి ఒకటిన్నర సంవత్సరం వయసున్న కుమారుడు ఉన్నారు. సాంబమూర్తికి భార్య సరోజమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీలది అపవిత్ర కలయిక

తాడిపత్రి: తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు అపవిత్రమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. తాడిపత్రిలోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు పార్టీల పొత్తు అనైతికమని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు ఇవే మూడు పార్టీలు సాక్షాత్తు తిరుపతి వెంకన్న సాక్షిగా ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశాయని గుర్తు చేశారు. ఏపీకి పదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ పెద్దలు హామీనిచ్చారన్నారు. పోలవరం నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, ఏపీకి రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని, అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని, వెనుకబడిన జిల్లాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని తదితర బోలెడు హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన తర్వాత అందులో ఏ ఒక్కటీ నెరవేర్చిన దాఖలాలు లేవన్నారు. తాజాగా మళ్లీ పొత్తు పెట్టుకుని రాష్ట్ర ప్రజల గొంతు కోసేందుకు సిద్ధమయ్యాయని మండిపడ్డారు. ఈ మూడు పార్టీలు అవకాశ వాద రాజకీయాలకు తెరలేపి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నామన్నారు. గతంలో కేంద్రం పాచిపోయిన లడ్డూలు ఇస్తుందని ఆరోపణలు చేసిన పవన్‌కు ఇప్పుడు ఆ లడ్డూలే కమ్మగా ఎలా మారాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో తిరుపతిలో అమిత్‌షాపై చంద్రబాబు రాళ్ల దాడి చేయించారన్నారు. ఏపీకీ అన్యాయం చేసిందని బీజీపీకి వ్యతిరేకంగా దొంగ ధర్మదీక్షలు చేసి, నాడు బీజేపీని నానా మాటలు అన్నారని గుర్తు చేశారు. అమరావతి రాజధాని ప్రారంభోత్సవం సందర్భంగా తట్టెడు మట్టి, చెంబుడు నీళ్లు మాత్రమే ఇచ్చి ప్రధాని మోదీ మోసం చేశాడని అప్పట్లో దూషణలకు పాల్పడిన చంద్రబాబు తో బీజేపీ పొత్తు పెట్టుకోవడం సిగ్గు చేటన్నారు. ఎన్నికలు ఏ క్షణంలో జరిగినా జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి

కళ్యాణదుర్గం: స్థానిక మార్కెట్ యార్డులో శనివారం జరిగే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, గుంతకల్లు నియోజవకర్గ పరిశీలకులు వై.భీమిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం 12.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. రాయలసీమ జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కళ్యాణదుర్గం సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న వెంటనే నియోజవకర్గంలోని పలు గ్రామాల్లో తాగునీరు, రహదారులు, వీధిలైట్ల సమస్య పరిష్కరించినట్లు గుర్తు చేశారు. ఇప్పటి వరకూ దాదాపు రూ.300 కోట్ల ఎంపీ కోటా నిధులు ఖర్చు చేసినట్లు వివరించారు. నియోజకవర్గానికి తలమానికంగా ఉన్న బీటీపీని పూర్తి చేసి 114 చెరువులకు తాగు, సాగునీరందిస్తామన్నారు. ఇప్పటికే నిర్వాసిత రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేసిందన్నారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ... టీడీపీ, జనసేన, బీజేపీలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయన్నారు. 2014 ఎన్నికలకు ముందు అన్ని పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలోకి తొక్కాయని విమర్శించారు. మరోసారి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎంఆర్‌సీ రెడ్డి మాట్లాడుతూ... సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను ఎవరూ నమ్మబోరాదన్నారు.

సీఎం జగనన్నతోనే మహిళా సాధికారత



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగనన్నతోనే రాష్ట్రంలో మహిళా సాధికారత సాధ్యమైందని, అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందేలా పెద్ద పీట వేస్తూ వచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజమ్మతో పాటు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ ఎం.మంజుల, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, పార్టీ మహిళా విభాగం జిల్లా, నగరాధ్యక్షురాళ్లు శ్రీదేవి, కృష్ణవేణి కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. గిరిజమ్మ మాట్లాడుతూ... ప్రధానంగా మహిళలకు అత్యంత రాజకీయ ప్రాధాన్యత కల్పించింది వైఎస్సార్‌సీపీనేనన్నారు. ఈ విషయంగా సీఎం వైఎస్ జగనన్నకు తామెంతో రుణపడి ఉన్నామన్నారు. మంజుల మాట్లాడుతూ... పూలే, అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగనన్న బాటలు వేశారన్నారు. ఎం.లిఖిత మాట్లాడుతూ.. మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు సీఎం జగనన్న తీసుకున్న చర్యలను కొనియాడారు. శ్రీదేవి, కృష్ణవేణి మాట్లాడుతూ... మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పురోగతి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి మహిళా పనిచేయాలని, మరోసారి సీఎంగా జగనన్నను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ శోభారాణి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు రాధ, నాయకురాళ్లు సుహాసిని, అనిత, సుజాతరెడ్డి, పార్వతి, దేవి, ఉష, శోభాబాయి, ప్రసన్న పాల్గొన్నారు.

జిల్లా బహిష్కృత మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రి అర్బన్: కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి జిల్లాలోనే సంచరిస్తున్న బహిష్కృత మట్కా బీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ మురళీకృష్ణ తెలిపిన మేరకు.... తాడిపత్రిలో నివాసముంటున్న మట్కా బీటర్ దూదేకుల కుళ్లాయప్పతో పాటు మరో ఆరుగురిని గత ఏడాది డిసెంబర్‌లో జిల్లా నుంచి బహిష్కరిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే కుళ్లాయప్ప కలెక్టర్ ఉత్తర్వులు ధిక్కరించి తాడిపత్రిలోనే సంచరిస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కదిరి, టీసీఏ గెలుపు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సీనియర్స్ ఏపీఎల్-20 మ్యాచ్‌లో కదిరి, టీసీఏ జట్లు గెలుపొందాయి. ఏడీసీఏ క్యాంప్ కదిరి, క్రిక్ లవర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కదిరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 178 పరుగులు చేసి 5 వికెట్లు కోల్పోయింది. జట్టులో డి.సాయిప్రణీత్ 51, కె.ప్రశాంత్ 48 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన క్రిక్ లవర్స్ 18.4 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. 20 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. టీసీఏ అనంతపురం, హెచ్‌సీఏ హిందూపురం జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 148 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 16 ఓవర్లలోనే మూడు వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులో పి.అర్జున్ టెండూల్కర్ 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 95 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచి, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు.

హామీ మేరకు డ్వాక్రా రుణమాఫీ

- మీకు జరిగిన మేలును మరవొద్దు
- మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 33వ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి. చిత్రంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: గత టీడీపీ ప్రభుత్వం మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని మోసం చేస్తే ఎన్నో మహిళా సంఘాలు డీఫాల్ట్ అయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు మాఫీ అయ్యాయి. వీటితో పాటు నవరత్నాల్లో మహిళలను భాగస్వామ్యులను చేయడం ద్వారా మహిళా సాధికారత సాధించారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 33వ డివిజన్ నాయక్‌నగర్‌లో సీఎండీఎఫ్ నిధులు రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మఒడి, పేదలందరికీ ఇళ్లు, చేయూత, ఆసరా, తదితర పథకాల్లో మహిళల పేరు మీద ఇవ్వడం జరిగిందన్నారు. తద్వారా మహిళలు ఆర్థిక పురోగతి సాధించారని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడం కోసం కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పారదర్శకంగా రుణాలు మంజూరు కోసం ఆర్పీలకు మంచి పారితోషకాన్ని అందించారన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రాజకీయంగా మహిళలకు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్లు, మునిపల్ చైర్‌పర్సన్లు, నామినేటెడ్ పదవుల్లో పురుషులతో సమాగంగా మహిళలకు పెద్దపీట వేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ విధంగా మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని పసుపు కుంకుమతో సరిపెట్టారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని అది చేస్తాం.. ఇది చేస్తామంటూ అబద్ధపు హామీలను గుప్పిస్తున్నారన్నారు. కేవలం ఓట్ల కోసం చంద్రబాబు అబద్ధపు హామీలను ఇస్తున్నారన్నారు.

రూ.వెయ్యి కోట్లకుపైగా అభివృద్ధి

అనంతపురం నియోజకవర్గంలో అర్హతే ప్రామాణికంగా రూ.2 వేల కోట్లకుపైగా సంక్షేమం, రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నగరం నలుదిక్కులతో పాటు, అంతర్గత రోడ్లు, కాలువ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రూపు రాజకీయాలతో సంక్షేమం, అభివృద్ధి కుంటుపడిందన్నారు.

దిశతో రక్షణ

తెలంగాణలో దిశ ఘటన జరిగితే రాష్ట్రంలో అక్క చెల్లెమ్మలు ఎవరూ కూడా అటువంటి ఇబ్బందులు పడకూడదని ఫ్రెండ్లీ పోలీసును తీసుకురావడంతో పాటు మహిళ కోసం ప్రత్యేకంగా దిశ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేసిన వెంటే సకాలంలో పోలీసులు స్పందించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మీరు బాగుండాలని, మీ బిడ్డలకు బాగుండాలని తపించే వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, స్థానిక కార్పొరేటర్ సాకే చంద్ర, కార్పొరేటర్ సైఫుల్లాబేగ్, కమల్ భూషణ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శోభారాణి, నాయకులు అంజి, లింగమయ్య, ఆర్య, గురు జేత, అంజలి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడమే పరిటాల నైజం



సింగంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సమన్వయకర్త శాంతమ్మ



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- గాలిమరల విషయంలో రైతులను మోసగించారు
- ప్రజలకు మంచి చేసే బాధ్యత వైఎస్సార్‌సీపీది
- ఆత్మకూరు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రజలను ఇబ్బందులకు గురి చేసి దోచుకోవడమే పరిటాల కుటుంబం నైజం అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని సింగంపల్లిలో మొదటగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం సింగంపల్లి తండా, వై.కొత్తపల్లి గ్రామంలో ప్రచారం కొనసాగించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు ప్రజలు పూలు చల్లుతూ డప్పు వాయిద్యాల నడుమ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2024లో చంద్రబాబు ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి, ప్రజలను మోసం చేశారన్నారు. రైతు రుణాలు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ప్రతి గ్రామంలో టీడీపీ నాయకులు నీరు చెట్టు ద్వారా రూ.లక్షల్లో దోచుకున్నారని ఆరోపించారు. మంత్రిగా పని చేసిన పరిటాల సునీత, వాళ్ల సోదరులు, వాళ్ల బంధువులు కూడా అవినీతికి పాల్పడి రూ.వందల కోట్లు దోచుకున్నారన్నారు.

ప్రజలకు ఏం కావాలన్నా వాళ్ల గడప తొక్కాల్సిందే..

నియోజకవర్గ ప్రజలకు ఏం కావాలన్నా పరిటాల గడప తొక్కాల్సిన పరిస్థితి గతంలో ఉండేదని తెలిపారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో పారదర్శకంగా పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గాలిమరల విషయంలో రైతులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. గాలిమరలకు 3.50 ఎకరాలకు కంపెనీ వారు రూ.65 లక్షలు ఇస్తుంటే పరిటాల సునీత కొడుకు సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్ పేరుతో రూ.65 లక్షలు తీసుకుని రైతులకు రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. సిద్ధరాంపురం, సింగంపల్లి గ్రామాల్లో కమ్మ వర్గానికి చెందిన వారికి కూడా చీనీ చెట్లకు సంబంధించి లక్షల రూపాయలు ఇన్సూరెన్స్‌గా అందించామన్నారు. మంత్రిగా ఉన్న పరిటాల సునీత పేరూరు డ్యాంకు నీరు తీసుకురాలేని మనిషిగా మిగిలిపోయిందన్నారు. మేము అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు నీరు తీసుకువచ్చామని పేర్కొన్నారు. సోలార్ మెగా పార్కు, గార్మెంట్ పరిశ్రమకు శ్రీకారం చుట్టామన్నారు. అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. రైతులకు ఉచితంగా బోర్లు వేశామన్నారు. రూ.117 కోట్లతో రోజుకు 16 గంటలు నీరు అందిచేలా శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 17 వేల మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రకాష్‌రెడ్డి పేరు చెబితే ఇవన్నీ గుర్తుకు వస్తాయని.. పరిటాల కుటుంబం పేరు చెబితే చెప్పుకునేందుకు ఏమీ లేవన్నారు. అంతేకాకుండా సీఎం జగన్ నవరత్నాల పథకాల ద్వారా ప్రతి ఇంటికి పథకాలు అందిస్తూ ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చారని తెలిపారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు విజయ్‌కుమార్ నాయక్, నీలిమ, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఫణిరెడ్డి, వాసుదేవరెడ్డి, గోపాల్‌రెడ్డి, అతిక్‌రెడ్డి, వెంకటేష్, ఆదెప్ప, కృష్ణానాయక్, నరసింహులు, నాగరాజు, బాలస్వామిరెడ్డి, సుధాకర్ రెడ్డి, గోవింద్, రాము నాయక్, మహేష్, టీటీ టైలర్ వెంకటేష్, ఓబయ్య, భాస్కర్, ముత్యాల రెడ్డి, గోపాల్, ఎసర్పంచులు చంద్రశేఖర్, ఎర్రిస్వామి, నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపినట్లు మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య కలిసి బుడ్డప్ప నగర్‌లో పర్యటించారు. ప్రస్తుతం నీటి సరఫరా ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అందుకు ప్రజలు గతంలో లాగానే నీరు సమృద్ధిగా వస్తోందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి కృషి, పాలకవర్గం ఆధ్వర్యంలో రాబోయే పదేళ్ల వరకూ అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం మూడు మోటర్ల ద్వారా పంపింగ్ జరుగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో మోటర్ల సమస్య రాకుండా ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో 760 హెచ్‌పీ మోటర్‌ను కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మరో 500 హెచ్‌పీ మోటర్‌ను సాధారణ నిధులతో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ రామమోహన్‌రెడ్డి, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

24న శారదా మాత విగ్రహ ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగరంలోని శృంగేరీ శారదా శంకర మఠంలో మూడు రోజుల పాటూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగనున్నాయి. శుక్రవారం ఆలయ మేనేజర్ సత్యప్రసాద్ వివరాలు వెల్లడించారు. శృంగేరీ మఠం శాఖలో ఈనెల 22న విధుశేఖర భారతీ మహాస్వామి విచ్చేసి పాదుకా పూజ, చంద్రమౌళీశ్వర పూజల్లో పాల్గొంటారు. అనంతరం అనుగ్రహ భాషణం చేస్తారు. 23న ఉదయం సర్వదర్శనం, పాదుకా పూజలు, అనంతరం సంస్కృతంలో అష్టావధానం జరుగుతుంది. 24న శారదా మాత పంచలోహ విగ్రహ ప్రాణప్రతిష్ట, గోపుర శిఖర కుంభాభిషేకాలు శాస్త్రోక్తంగా జరుగుతాయి. భక్తులు స్వామి విజయయాత్రలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



సూచనలిస్తున్న అనంతపురం డీఎస్పీ జి.వీర రాఘవ రెడ్డి

అనంతపురం: రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అనంతపురం డీఎస్పీ జి.వీర రాఘవ రెడ్డి పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లు, యూనియన్లతో పోలీసులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ పలు సూచనలు చేశారు. ఆటోడ్రైవర్స్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ సమయంలో యూనిఫాం తప్పకుండా ధరించాలని తెలిపారు. మైనర్లకు ఎట్టి పరిస్థితిల్లో ఆటోలు ఇవ్వకూడదని సూచించారు. అన్ని రికార్డులు తప్పకుండా జిరాక్స్ కాపీలను ఉంచుకోవాలి. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



రామగిరిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



రాప్తాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న దృశ్యం

రాప్తాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత జగనన్న పాలనకు ఉన్న తేడా ఏమిటో ప్రజలే బేరీజు వేసుకుని ఎవరూ మేలు చేశారో తెలుసుకోవాలన్నారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఎంత బాగా పరిపాలన చేశారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. పథకాలు, వాటి రూపేణ మంజూరు చేసిన కోట్లాది రూపాయలు, సంక్షేమం అభివృద్ధిని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఎందుకు అమలు చేయలేదో నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన మాటలు నమ్మొద్దు..

రామగిరి: మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసే నాగార్జున తదితరులు ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికీ లబ్దిచేకూరిందన్నారు. టీడీపీ, జనసేన ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సర్పంచ్ మీనుగ నాగరాజు, నాగార్జున, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



డీఈఓ వరలక్ష్మిని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళలు ధైర్యంగా ముందడుగు వేస్తే కచ్చితంగా విజయం చేకూరుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆంధ్ర నాట ఉపాధ్యాయ ఉద్యమాన్ని స్థాపించి, అధికారులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఏపీటీఎఫ్ నాయకురాలు పి.మాణిక్యాంబను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు డి.గాయత్రి, సుభద్ర, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, గుత్తి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి శ్రీదేవి, రాష్ట్ర కౌన్సిలర్ అంజలీదేవి, విజయలక్ష్మి, లక్ష్మీ నారాయణమ్మ, నీరజ, రామక్క, శారదా దేవి, శ్రీదేవి, మణిమాల, యశోద, నందిని, కళావతి, ప్రసన్న లక్ష్మీ, జయలక్ష్మి, శంషాద్ బేగం పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్లు సూర్యానారాయణగౌడ్, సురేష్‌కుమార్, నాయకులు రవి, మురళీకృష్ణ, ఆదినారాయణ, మల్లికార్జున, రామకృష్ణ, రాజశేఖర్, విరుపాక్షి గౌడ్ పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రజక్ నగర్‌లో శుక్రవారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వం మహిళలకు చేసిన మేలును విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, దుర్గాదేవి, నాయకులు నిమ్మల నాగరాజు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: రజక్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, మానవ హక్కుల వేదిక నాయకుడు చంద్రశేఖర్, మానవతా రక్తదాతల ప్రతినిధి తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: అన్ని రంగాల్లో మహిళలు తమ శక్తిని చాటాలని మహిళ సమాఖ్య నాయకురాళ్లు అన్నారు. శుక్రవారం ఏపీ మహిళ సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. మనువాద, మెజారిటీ వాద రాజకీయాలను ప్రతిఘటిద్దాం అంటూ నినాదాలు చేశారు. ముందుగా సమాఖ్య జెండాను నాయకురాళ్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షురాలు కమ్మక్క, నాయకురాళ్లు లక్ష్మీదేవి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో..

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ గరికిపాటి గురజాడ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొలిటికల్ సైన్సెస్ ప్రొఫెసర్ సి.షీలా రెడ్డి హాజరై మాట్లాడారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల ఓర్పు, వారి ప్రాముఖ్యతను వివరించారు. వర్సిటీలో పనిచేస్తున్న మహిళా ప్రొఫెసర్లు, ఉద్యోగులను సత్కరించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ దీపాంకర్ డే, డాక్టర్ వీఎస్ఎస్ శ్రేయ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ షీలారెడ్డి

రేపు 46వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 46వ డివిజన్‌లో ఆదివారం ఉదయం 7:00 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని 5వ రోడ్డు సాయిబాబా గుడి వద్ద నుంచి కార్యక్రమం మొదలవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ

అనంతపురం రూరల్: రుద్రంపేట ప్రభుత్వ పాఠశాల సమీపంలో శివాలయం నిర్మాణానికి శుక్రవారం గ్రామ ప్రజల ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. శివరాత్రి పర్వదినం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో శివాలయ అభివృద్ధి బృందం సభ్యులు పాల్గొన్నారు.

రేపు హజ్ యాత్రికులకు శిక్షణ

అనంతపురం కల్చరల్: జిల్లా నుంచి హజ్‌కు వెళ్లే యాత్రికులకు ఆదివానం శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు హాజీ ఖాదిమ్ మహమ్మద్ రఫీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం రోడ్డు ఆజాద్ నగర్‌లో (డోర్ నం.6-617-6) విజయ పబ్లిక్ స్కూల్ సమీపంలోని జాకీర్ సాబ్ ఇంటి ప్రాంగణంలో శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. హాజీలకు భోజన సౌకర్యం, మహిళలకు పర్దా వసతి కల్పిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9440983090, 9493630356 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అక్కచెల్లెమ్మల కళ్లలో ఆనందం



కొడిమిలో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటిపట్టాలను రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో అక్కచెల్లెమ్మల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అనంతపురం రూరల్ మండలంలో వివిధ పంచాయతీల్లో ఇంటి పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డీడ్స్ లబ్ధిదారులకు అందజేశారు. కురుగుంటలో 90 మందికి జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యం నాయుడు, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కవిత, ఉప సర్పంచ్ మాధవరెడ్డి చేతుల మీదుగా రిజిస్ట్రేషన్ డీడ్స్ అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఇప్పటి దాకా 7 వేలకు పైగా పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, బండి పవన్, మాజీ ఎంపీటీసీ కిరణ్ కుమార్ రెడ్డి, డీలర్ రఫి పాల్గొన్నారు. కందుకూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంత్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యురాలు రాగే రేవతిపెద్దప్ప, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ పాల్గొన్నారు. ఆలమూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్‌చేసిన పట్టాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ సురేంద్ర పంచాయతి కార్యదర్శి వలి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, ఓబులేష్, తలారి శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ చంద్రమౌళి, స్టోర్ డీలర్ నాగేంద్ర పాల్గొన్నారు. కొడిమి పంచాయతీలో సర్పంచ్ సుబ్బిరెడ్డి చేతుల మీదుగా కొడిమి, నరసనాయనికుంటకు చెందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డీడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపాల్‌రెడ్డి, రామాంజనరెడ్డి, మాజీ సర్పంచ్ ఆదినారాయణ, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం: నృత్యం చేస్తున్న చిన్నారులు



కనగానపల్లి: ముక్తీశ్వరాలయంలో పూజలు



చెన్నేకొత్తపల్లిలోని శివాలయంలో ..



అనంతపురం: బసవన్న ఆలయంలో అలంకరణ



మొదటి రోడ్డు శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అనంత



అనంతపురం: పాతూరు విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణ



ఆత్మకూరు: పూజలు చేస్తున్న అర్చకులు

● సర్వం శివమయం

ఆత్మకూరు/రాప్తాడు/కనగానపల్లి/రామగిరి/చెన్నే కొత్తపల్లి/అనంతపురం కల్చరల్: పవిత్ర మాఘమాసంలో వచ్చే మహాశివరాత్రి పండుగను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. భక్తిభావం ఉట్టిపడేలా పలు చోట్ల పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాలు నేత్రానందరంగా సాగాయి. పరమపద మోక్ష సోపానమే లక్ష్యంగా భక్తజన కోటి మహాశివుడి కృప కోసం పరితపిస్తూ ఉదయం నుంచి రాత్రి వరకూ బారులు తీరి దేవదేవుడ్ని దర్శించుకున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో శివరాత్రి సందడి నెలకొంది. కనగానపల్లిలోని మల్లికార్జునస్వామి, తగరకుంటలోని మల్లన్నస్వామి, ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయం, పర్వతదేవరపల్లిలో మల్లికార్జునస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామగిరి మండలంలోని పేరూరు, నసనకోట, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి గ్రామాల్లోని శివాలయాల్లో జాగరణ జరిగింది. చెన్నేకొత్తపల్లిలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు మంజునాథ్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, అభిషేకం, తదితర పూజలు చేపట్టారు. కోన మల్లికార్జున స్వామికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం శివ పార్వతులకు కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సంక్షిప్త సమాచారం

రేపు 'సీమ ఉపాధ్యాయ కథలు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'రాయలసీమ ఉపాధ్యాయ కథలు' పుస్తకావిష్కరణ జరగనుంది. అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ ముఖ్య అతిథులుగా విచ్చేసి డాక్టర్ ఎం.హరికిషన్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర పేర్కొన్నారు.

రేపు అరణ్య రోదన నాటక ప్రదర్శన

అనంతపురం కల్చరల్: లలితకళాపరిషత్తు మాజీ సెక్రటరీ, దివంగత ఆదోని నరసింహమూర్తి జయంతి సందర్భంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు 'అరణ్యరోదన' సందేశాత్మక సాంఘిక నాటకం ప్రదర్శిస్తున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి జి.పద్మజ తెలిపారు. స్థానిక లలితకళ పరిషత్తు ప్రాంగణంలో జరిగే ప్రదర్శనకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొంటారన్నారు. అందరూ కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

నేడు 'లంకమల దారుల్లో' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక ఎన్జీఓ హోమ్‌లో శనివారం ఉదయం 10 గంటలకు రచయిత వివేక్ లంకమల రచించిన 'లంకమల దారుల్లో' పుస్తకావిష్కరణ జరగనుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామితో పాటూ పలువురు సీనియర్ రచయితలు, కవులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నట్లు నిర్వాహకుడు మైత్రేయ మురళీకృష్ణ తెలిపారు.